క్లుప్తంగా

తడి, పొడి చెత్తపై అవగాహన



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో మున్సిపల్ అధికారులు కాలనీవాసులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇంటింటికి వచ్చే మున్సిపల్ చెత్త వాహనాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు ఆఫీసర్ నర్సయ్య, మెప్మా ఆర్పీలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి'

ఆర్మూర్‌టౌన్‌: ప్రజా సమస్యల పరిష్కారానికి ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగొట గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గల్ఫ్ బాధితులు, సామాజిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను గుర్తించి అసెంబ్లీ వేదికగా మంత్రుల, అధికారుల చుట్టు తిరుగుతూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. నందిపేట్ మండలం అయిలాపూర్ వసతి గృహానికి రూ. 2.40 కోట్లు మంజూరు చేయించడంతో పాటు, ప్రజా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

చిన్నాపూర్‌లో రైతు సంఘం సభ్యత్వం



మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్‌లో శనివారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ ఆధ్వర్యంలో సంఘం గ్రామ స్థాయి నాయకులు శనివారం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ శోభన్‌బాబు హాజరయ్యారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగానే ఈ సభ్యత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎర్ర సాయిలు, కొండ గంగాధర్, ఇడగొట్టు సాయిలు, విజయ్, నారాయణ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉచిత కంటి పరీక్షలు



బాల్కొండ: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు జాతీయ అంధత్వ నివారణ పథకంలో భాగంగా శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు గురురాజ్ విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎంఈవో రాజేశ్వర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్‌వో భవాని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్ ఎంపీడీవోగా భీమ్‌రావ్



రుద్రూర్: రుద్రూర్ ఎంపీడీవోగా భీమ్‌రావ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన సురేశ్‌బాబు పదవీ విరమణ పొందారు. భీంగల్‌లో పని చేస్తున్న భీమ్‌రావ్ రుద్రూర్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన ఎంపీడీవోను కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడపల్లి ఎంఈవో శివలింగ్ గాలప్ప



ఎడపల్లి: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోగా శివలింగ్ గాలప్ప శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, పీఆర్టీయూ నేతలు ఎంఈవోను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఈవో ఆంజేయులు, సాయిరెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్‌రావు, బాలేశ్, శ్రీనివాసరెడ్డి, శ్రీరామరావు, దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

వంతెనలకు మోక్షమెప్పుడో ?

- ఏడు వంతెనలకు మూడే నిర్మాణం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

నందిపేట్: మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన పలు వంతెనలకు మోక్షం కలుగడం లేదు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందిపేట నుంచి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి ప్రతిరోజు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఈ మార్గం గుండా ఉన్న సమస్యలను గుర్తించిన గత ప్రభుత్వం నందిపేట నుంచి మాక్లూర్ మండలం మాదాపూర్ వరకు రోడ్డు విస్తరణ, వంతెనల నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు పనులు పూర్తయినా వంతెనల నిర్మాణం ఇప్పటి వరకు పూర్తి కాలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ. 18 కోట్లతో పనులు

నందిపేట నుంచి మాదాపూర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు 2017లో గత ప్రభుత్వం రూ. 15 కోట్లు మంజూరు చేసింది. అలాగే రోడ్డు భద్రత కింద 7 వంతెనల నిర్మాణానికి రూ. 3 కోట్ల నిధులను అదనంగా మంజూరు చేసింది. ఇప్పటి వరకు రోడ్డు విస్తరణ, మూడు వంతెనల నిర్మాణం పూర్తయినా మిగతా నాలుగు వంతెనల నిర్మాణ పనులు పనులను చేపట్టలేదు.



పలుగుట్ట ప్రాంతం వద్ద ముళ్లపొదల మధ్య ఇరుకుగా ఉన్న వంతెన

బ్రిడ్జిలను ఢీకొని మృత్యువాత

నందిపేట మండలంలోని రైతుఫారం, విజయనగరం, పలుగుట్ట ప్రాంతాల్లో వంతెన బ్రిడ్జిలను నిర్మించకపోడంతో ఏడాది కాలంలో జరిగి ప్రమాదాల్లో పది మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. పలువురు అంగవైకల్యం చెందారు. బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరి కనపడకుండా పోవడంతో వాహనదారులు బ్రిడ్జిలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌తో బ్రిడ్జిలు కనపడకుండా పోతున్నాయి. ఒకవైపు నుంచి భారీ వాహనాలు వస్తుంటే మరోవైపు బ్రిడ్జిల వద్ద వాహనాలు దాటడం కష్టంగా మారింది. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వంతెన ఇరుకుగా ఉన్నట్లు దూరప్రాంతాల వారికి, రాత్రిపూట కొత్తగా వచ్చే వారికి తెలియక పోవడంతో వంతెనను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నందిపేట మండలం రైతుఫారం వద్ద..



విజయనగర్ వద్ద..

కొత్త ఎస్టిమేషన్ పంపించాం

గతంలో సాంక్షన్ అయిన బ్రిడ్జి నిర్మాణ పనులు చేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శాఖపరమైన చర్యలు చేపట్టాం. పాత ఎస్టిమేషన్ ధరల ప్రకారం పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో నాలుగు బ్రిడ్జిల నిర్మాణాలకు రూ. 1.65 కోట్లతో కొత్తగా ఎస్టిమేషన్ వేసి సాంక్షన్ కోసం పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు చేపడతాం. నామ్‌దేవ్, ఆర్‌అండ్‌బీ (ఆర్మూర్ డివిజన్ డీఈఈ)

వేసవిలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

రుద్రూర్: బోధన్ డివిజన్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ ఎండీ ముక్తార్ పేర్కొన్నారు. రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన వ్యాక్యుమ్ సర్క్యూట్ బ్రేకర్‌ను ప్రారంభించి మాట్లాడారు. బొప్పాపూర్, అక్బర్‌నగర్ వ్యవసాయ ఫీడర్లకు ఒకే వీసీబీ ఉన్నందున విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలిగే ఆస్కారం ఉందన్నారు. దీనిని తొలగించడానికి మరో వీసీబీని ఏర్పాటు చేశామన్నారు. బోధన్ డివిజన్‌లో 13 వీసీబీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోటగిరి మండలం ఎత్తొండలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు వెల్లడించారు. బోధన్ మండలం ఆచన్‌పల్లి, సాలూర మండలం జాడిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కానున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ నగేశ్‌కుమార్, మండల ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్లు గిరిధర్, నవీన్, లైన్‌మన్లు గంగాధర్, శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.



సబ్‌స్టేషన్‌లో వీసీబీ చార్జ్ చేసి ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో డీఈఈ

గుత్పలో ఘనంగా సైన్స్‌ఫేర్

మాక్లూర్: సైన్స్‌డేను పురస్కరించుకుని శనివారం మండలంలోని గుత్ప సీపీఆర్ఎం పాఠశాలలో ఘనంగా సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నిత్యానందం పర్యవేక్షణలో విద్యార్థులు వందకు పైగా ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ప్రధానంగా ఉప్పునీరు మంచినీరుకు ఉన్న తేడాను తెలుపుతూ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టును కార్యక్రమానికి హాజరైన ఎంఈవో నరేందర్ అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి ప్రాజెక్టు ఆకట్టుకున్నాయి. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో మేధా శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈవో నరేందర్

ఆర్మూర్ మెజిస్ట్రేట్‌కు సన్మానం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన ఆర్మూర్ కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి గట్టు గంగాధర్‌ను స్థానిక బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల బాలకృష్ణ, సభ్యులు జోగ గంగాధర్, ప్రదీప్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మెజిస్ట్రేట్‌ను సన్మానిస్తున్న సభ్యులు

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గత నెల 20 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ సర్వే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో జరుగుతోందన్నారు. సిటిజన్ల నుంచి ఫీడ్‌బ్యాక్ పెంచే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే పట్టణ ప్రజలు మొబైల్ యాప్ ద్వారా కూడా తమ ఫీడ్‌బ్యాక్ ఇవ్వవచ్చన్నారు. మున్సిపాలిటీ అందించే సేవలపై పది ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజలు ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్స్ మార్చి 31లోపు చెల్లించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ హయూమ్, డీఈ భూమేశ్, అధికారులు శేఖర్, ప్రవీణ్, మనోహర్, దత్తారెడ్డి, శానిటరి ఎస్సై గజానంద్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రాజు

ఘనంగా ఎంఐఎం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్, అంబేద్కర్ చౌరస్తాలో శనివారం ఎంఐఎం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎంఐఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను పట్టణ అధ్యక్షుడు జహీర్ అలీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరించిన జహీర్‌అలీ, నాయకులు

మాదిగ అమరవీరులకు ఘన నివాళి



సాలూరలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం ఘన నివాళులు అర్పించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో మాదిగ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధాన చౌరస్తాల్లో అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. అమరుల ప్రాణత్యాగం వల్లే ఎస్సీ వర్గీకరణ లక్ష్యం సిద్ధించబోతోందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. కార్యక్రమల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోధన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా, డివిజన్ ప్రతినిధులు



శక్కర్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రతినిధి విద్యాసాగర్



కమ్మర్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు



ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో..



కోటగిరిలో ఎమ్మార్పీస్ నాయకులు



మోర్తాడ్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆధ్యాత్మికం

■ భక్తిశ్రద్ధలతో మోతె జాతర



వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి జాతర శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ మూడు సార్లు రథోత్సవం చేపట్టారు. స్వామివారిని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ము త్యాల సునీల్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. భక్తులకు వీడీసీ సభ్యులు అన్నదానం చేశారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

■ నేడు వీరబ్రహ్మేంద్రస్వామి జాతర



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో ఆదివారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతర జరుగనుంది. జాతరకు స్థానిక విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉదయం అభిషేకాలు, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, మాండాలమ్మ కల్యాణం జరుగనుంది. సాయంత్రం ఆలయం నుంచి గ్రామంలోని కిందివాడ వరకు రథోత్సం నిర్వహిస్తారు. జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం చేయడానికి ఏర్పాట్లు చేశారు.

■ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి తమలపాకు, సింధూర పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షతో మానసిక ప్రశాంతత



స్వాములకు మాలధారణ చేస్తున్న ప్రవీణ్ మహరాజ్

బోధన్‌రూరల్: హనుమాన్ దీక్షతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోధన్ మారుతి మందిర్ ప్రధాన అర్చకుడు ప్రవీణ్ మహరాజ్ అన్నారు. శనివారం పట్టణంలోని మారుతి మందిర్ అర్చకుడు ప్రవీణ్ మహరాజ్ హనుమాన్ స్వాములకు హనుమాన్ మాలధారణ చేశారు. అనంతరం మాలధారణ నియమాల కరపత్రాలను అందించారు. దీక్షాపరులు మాలధారణ సమయంలో నిష్ఠతో పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, దీక్షాపరులు చందు, శ్రీను, మహేశ్, వాసు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల చోరీ

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ర్యాగల్ల ప్రభాకర్ ద్విచక్ర వాహనం శుక్రవారం రాత్రి చోరీకి గురైనట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. ఇంటి బయట నిలిపి ఉంచిన బైక్‌ను దుండగులు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. శనివారం మేకల సంతకు వచ్చిన బోధన్‌కు చెంది న మహేశ్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించినట్లు తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.15, శబ్దం (తెలుగు) - 1.35, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు) -4.40, అగత్యా(తెలుగు)-7.50, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	శబ్దం(తెలుగు)-10.05, ఛావా (హిందీ) -1.10, 7.35, 10.55, మజాకా (తెలుగు) -4.30
స్క్రీన్-3-	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.10, మజాకా(తెలుగు)-1.20, గ్యాంగ్స్ ఆఫ్ వేస్ పూర్(హిందీ)-4.25, శబ్దం(తెలుగు)-7.40, 10.45
స్క్రీన్-4	నేనెక్కడున్నా(తెలుగు)-10.45, గార్డ్(తెలుగు)-1.25, ఛావా(హిందీ)-4.00, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20, మజాకా(తెలుగు)-10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా పిషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00, 4.40, 7.30, 10.20, అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40, మజాకా (తెలుగు) - 1.45, 7.35, 10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30, శబ్దం (తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05, మజాకా (తెలుగు) - 1.25, టర్న్ ఆఫ్‌ది డ్రాగన్ (తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	సందీప్‌కిషన్ మజాకా(తెలుగు)- 10.00, 4.15, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)- 1.05, ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40, ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు) - 4.10, 10.20, మజాకా(తెలుగు) - 7.15
స్క్రీన్ -4	ఓయ్(తెలుగు)-10.05, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30, ఛావా(హిందీ)-4.20, సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40, మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్
దేవి	మజాకా
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	130
		లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900		

– నిజామాబాద్ బిజినెస్



సట్లాపూర్‌తండా రోడ్డుపై ఏర్పడిన గుంత

గుంతల రోడ్లతో అవస్థలు

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మాక్లూర్: మండలంలోని సట్లాపూర్‌తండా బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, పాలకులు సైతం పట్టించుకోవడం లేదు. మండలంలోని మదన్‌పల్లి నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేపట్టి ఏళ్ల గడిచిందని తండావాసులు పేర్కొంటున్నారు. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తే ఇబ్బందిగా మారుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి సట్లాపూర్ తండా రోడ్డుకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతులు చేయించాలి



సట్లాపూర్‌తండా బీటీ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయించాలి. అత్యవసర పరిస్థితిలో బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. తండా మండలానికి చివరి గ్రామం అయినందున గ్రామంలో కనీస సౌకర్యాలు లేవు. – దినేశ్, తండా వాసి, మాక్లూర్

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణంలోని పలుచోట్ల మిషన్ భగీరథ నీరు పైప్‌లైన్ లీకేజీలు కావడంతో అధికారులు వాటికి మరమ్మతు పనులు చేపట్టారు. పైప్‌లైన్ లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు' కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని జెండాగల్లీలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలను మున్సిపల్ సిబ్బంది గుర్తించి మరమ్మతు పనులు చేపట్టారు. మిగిలిన చోట్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



జెండాగల్లీలో పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది